## రఫయదైన్‌ను వ్యతిరేకించే వారి ఆధారాలు మరియు వాటి జవాబులు

(ముహమ్మద్ దావూద్ రాజ్ రహిమహుల్లాహ్ గారి సహీ బుఖారీ ఉర్దూ అనువాదం ఆధారంగా)

1. జాబిర్ బిన్ సమర కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (వారి దగ్గరికి) విచ్చేసి యిలా సెలవిచ్చారు:

**مالی اراکم رافعی ایدیکم کانها اذناب خیل شمس اسکنوا فی الصلٰوة (صحیح مسلم باب الامر بالسکون فی الصلٰوة والنهی عن الاشارة بالید رفعهما عند السلام) -**

మచ్చిక కాని గుర్రాల తోకల లాగా మీరు చేతులు లేపడం నేను చూశాను. నమాజులో యిలా చేయకండి.

రఫయదైన్‌ను వ్యతిరేకించే వారి మొదటి ఆధారం యిది. కానీ దీనిని ఆధారంగా చేసుకొని రఫయదైన్‌ను త్యజించడం సరికాదు. ఎందుకంటే –

అ) అన్నింటికంటే ముందు ఇమామ్ నవవీ (రహిమహుల్లాహ్) స్వయంగా ఈ హదీసుకు సంబంధించిన అధ్యాయం నామకరణం చేసి, ఈ హదీసు తషహ్హుద్‌కు సంబంధించినదని తేల్చి చెప్పేశారు. ఎందుకంటే – కొంతమంది సలాము త్రిప్పేటప్పుడు తమ చేతులను లేపి సంజ్ఞ చేయడం చూసి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పై విధంగా సెలవిచ్చారు. అసలు విషయం ఇదైనప్పుడు, దీనికీ మరియు రుకూలోకి వెళ్ళే ముందు, రుకూ నుండి లేచేటప్పుడు రఫయదైన్ చేయడానికీ సంబంధం ఎక్కడుంది? ఇంకా వివరంగా అర్థం కావడానికి ఈ క్రింది హదీసు వుంది.

ఆ) జాబిర్ బిన్ సమర (రజి అల్లాహు అన్హు) కథనం : మేమొకసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో పాటు నమాజు చేశాం. నమాజు ముగించడానికి **అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహ్** అంటూ ముఖాన్ని యిరు వైపులా త్రిప్పేటప్పుడు **واشار بیده الی الجانبین** మేము చేతులను ఎత్తి వాటితో సంజ్ఞ కూడా చేశాం. దీనిని చూసి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యిలా సెలవిచ్చారు: **ماشانکم تشیرون بایدکم کانها اذناب خیل شمس** మచ్చిక కాని గుర్రాల తోకల లాగా మీరెందుకు చేతులను కదిలిస్తారు?

మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే – ويسلم على اخيه من على يمينه و شماله మీ చేతులను తొడలపై వుంచి యిరువైపు వున్న మీ సోదరులకు మీముఖాన్ని త్రిప్పి సలాము చేయండి, اذا سلم احدكم فليلتفت الى صاحبه و لا يومى (يرمى) بيده చేతుల సంజ్ఞతో కాదు. (సహీ ముస్లిం)

ఇ) హదీసువేత్త (ముహద్దిసీన్)లందరి ఏకాభిప్రాయం ఏమిటంటే– పైన వివరించబడ్డ రెండు హదీసులు వాస్తవానికి ఒకటే. కేవలం ఉల్లేఖకుల పదజాలంలో వ్యత్యాసం ఉంది. బుద్ధి మంతుడెవరైనా ఈ హదీసును చదివి దీనిని రఫయద్దైన్‌ను త్యజించడానికి ఆధారంగా చేసుకోలేడు.

జ్ఞానులై వుండికూడా ఎవరైతే దీనిని (రఫయద్దైన్ త్యజించడానికి) ఆధారంగా తీసుకు వస్తారో, వారిని గూర్చి ఇమామ్ బుఖారీ రహిమహుల్లాహ్ యిలా సెలవిచ్చారు: من احتج بحديث جابر بن سمرة على منع الرفع عند الركوع فليس له حظ من العلم ఏ వ్యక్తి అయినా జాబిర్ బిన్ సమర హదీసును 'రఫయద్దైన్ త్యజించడానికి ఆధారం' అని తలపోస్తాడో అతడు అజ్ఞాని మరియు హదీసు పరిజ్ఞానం ఎరుగని వాడు. ఎందుకంటే – اسكنوا فى الصلٰوة فانما كان فى التشهد لا فى القيام దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తషహ్హుద్‌లో సంజ్ఞ చేయడం చూసి సెలవిచ్చారు, కాని ఖియ్యాం స్థితిలో కాదు.

(జుజ్ రఫయద్దైన్ – బుఖారీ –16వ పేజీ, తల్‌ఖీస్ – 83వ పేజీ మరియు తోఫ –223 పేజీ)

ఈ వివరణ తర్వాత – కాస్తంత బుద్ధి జ్ఞానాలు కలిగివున్న వారెవరైనా కూడా – ఈ హదీసును రఫయద్దైన్‌ను త్యజించడానికి ఆధారంగా ఉపయోగించడం అనేది ధర్మసమ్మతం కాదు – అని తెలుసుకోగలుగుతారు.

**2) రఫయద్దైన్ వ్యతిరేకుల రెండవ ఆధారం:**

అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు) నమాజు చేయించారు **فلم يرفع يديه الا مرة** మరియు కేవలం ఒకేసారి చేతులెత్తారు. (అబూదావూద్, తిర్మిజి)

దీనిని కూడా చాలా గట్టిగా తీసుకొస్తుంటారు.

కానీ, హదీసు పరిజ్ఞానంలో నిష్ణాతులైన ఇమామ్ అబూదావూద్ స్వయంగా ఈ హదీసును గూర్చి యిలా రిమార్కు చేశారు:

**و ليس هو بصحيح على هذا اللفظ** "ఈ హదీసు ఈ పదజాలంతో సరైనది కాదు."

ఇమామ్ తిర్మిజి దీనిని గూర్చి యిలా పేర్కొన్నారు:

**يقول عبدالله ابن المبارك و لم يثبت حديث ابن مسعود** అబ్దుల్లా బిన్ ముబారక్ యిలా సెలవిచ్చారు: అబ్దుల్లా బిన్ మస్ఊద్ హదీసు యొక్క పరంపర ప్రామాణికంగా నిరూపించబడిలేదు. (తిర్మిజి - 36 పేజీ, తల్ఖీస్ - 83 పేజీ)

ఇమామ్ బుఖారీ, ఇమామ్ అహ్మద్, ఇమామ్ యహ్యా ఇబ్నె ఆదమ్ మరియు అబూ హాతిమ్ దీనిని బలహీనమైనదిగా నిర్ధారించారు. (ముస్నద్ అహ్మద్ - 3వ సంపుటం - 16 పేజీ)

ఇమామ్ నవవీ యిలా పేర్కొన్నారు: ఈ హదీసు బలహీనత గురించి హదీసు వేత్తలందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది.

అందువల్ల ఈ హదీసు రఫయదైన్‌ను త్యజించడానికి ఆధారం కాలేదు.

**3)** **మూడవ ఆధారం:** బరా బిన్ ఆజిబ్ కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మొదటిసారి రఫయదైన్ చేశారు, **ثم لا يعود** మళ్ళీ చేయలేదు. (అబూదావూద్)

ఈ హదీసును గూర్చి కూడా ఇమామ్ అబూదావూద్ స్వయంగా **هذا الحديث ليس بصحيح** "ఈ హదీసు ప్రామాణికమైనది కాదు" అని రిమార్కు చేశారు. (అబూదావూద్-1వ సంపుటం - 200 పేజీ)

**وقد رده ابن المديني و احمد والدار قطني و ضعفه البخاری** ఈ హదీసును ఇమామ్ బుఖారీ బలహీనమైనదిగా నిర్ధారించారు. అలీ బిన్ మదీనీ, ఇమామ్ అహ్మద్ మరియు దారెఖుత్నీ దీనిని (లోపాలున్న కారణంగా) 'తిరస్కరించబడిన హదీసు'గా ఖరారు చేశారు. కనుక ఇది కూడా ఆధారం కానేరదు.

(తన్వీర్ : 16 పేజీ)

**4)** **నాలుగవ ఆధారం:** అబ్దుల్లా బిన్ ఉమర్ కు ఆపాదించబడింది. అదేమిటంటే- 'ఆయన కేవలం ఒకేసారి చేతులెత్తారు' అని (తహావి)

దీనిని గురించి-స్వయానా హనఫీ ఉలమాలలో ప్రముఖులు మౌలానా అబ్దుల్ హై లక్నోవీ యిలా పేర్కొన్నారు: ఈ వచనం (లోపాలున్న కారణంగా) తిరస్కరించబడింది. కారణం, దీని పరంపరలో ఇబ్నె అయ్యాష్ అనే వ్యక్తి వున్నాడు. అతని లోపాలపై హదీసువేత్తలు వ్రేలెత్తి వున్నారు.

తదుపరి ఆయనే మళ్ళీ యిలా వివరించారు: అబ్దుల్లా బిన్ ఉమర్ స్వయంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) **فما زالت تلك صلوته حتى لقى الله تعالى** తన దైవదౌత్యపు ఆరంభం నుండి ఆఖరి నమాజు వరకు రుకూలోకి వెళ్ళేటప్పుడు, రుకూ నుండి లేచేటప్పుడు రఫయదైన్ చేశారని ఉల్లేఖించారు. మరి ఆయనే స్వయంగా దీనికి విరుద్ధంగా ఎలా పాటించగలరు? ఆయన (ఇబ్నె ఉమర్) ద్వారా రఫయదైన్ చేయడం ప్రామాణిక పరంపర ద్వారా నిరూపించబడి ఉంది. (తాలిఖుల్ ముమ్‌జిద్–193 పేజీ)

**5)** **ఐదవ ఆధారం** – అబూ బక్ర్ మరియు ఉమర్ (రజిఅల్లాహు అన్హుమ్) మొదటిసారే చేతులెత్తేవారు. (దారెఖుత్నీ)

దారెఖుత్నీ స్వయంగా దీనిని బలహీనమైనదిగా, అసత్యమైనదిగా ఖరారు చేశారు.

ఇమామ్ ఇబ్నె హజర్ యిలా పేర్కొన్నారు: ఈ హదీసును ఇబ్నె అల్‌జౌజి మౌజుఆత్ (కాల్పనిక హదీసులు)లో సంగ్రహించారు. కనుక ఇది కూడా ఆధారం కాలేదు. (తల్‌ఖీస్ అల్‌జీర్–83 పేజీ).

అంతేకాక అనస్, అబూ హురైరా, ఇబ్నె జుబైర్‌ల ద్వారా కూడా ఈ విషయంలో ఉల్లేఖించబడే వచనాలన్నీ కూడా అసత్యమైనవి **لا اصل لهم** మరియు నిరాధారమైనవి. (తల్‌ఖీస్ అల్ ముమ్‌జిద్ –83వ పేజీ)

**ఆఖరుగా** – హుజ్జతుల్ హింద్ "షావలీ ఉల్లాహ్ ముహద్దిస్ దెహల్వీ"గారి నిర్ణయం కూడా వినండి – తను యిలా పేర్కొన్నారు:

**والذى يرفع احب الى ممن لا يرفع** "రఫయదైన్ చేసేవాడు నాకు చేయని వాడికన్నా ఎక్కువ ప్రియమైనవాడు. ఎందుకంటే, దీనిపై ఎన్నో ఆధారాలు ప్రామాణికంగా నిర్ధారించబడి వున్నాయి." (హుజ్జతుల్లా అల్ బాలిగ – 2వ సంపుటం – 8వ పేజీ)

**కనుక, పై ఆధారాలూ, వాటి వాస్తవికతల ద్వారా రూఢి అయిన విషయ మేమిటంటే – రుకూలోకి వెళ్ళేటప్పుడు మరియు రుకూ నుండి లేచేటప్పుడు రఫయదైన్ చేయడమే సరైన విషయం మరియు సున్నత్. రఫయదైన్ చేయక పోవడం అనేది ఏ ప్రామాణిక హదీసు ద్వారా కూడా నిర్ధారించబడలేదు. (తెలుగు అనువాదకులు)**